పాఠశాలల్లో తపస్ సభ్యత్వం



సభ్యత్వం చేస్తున్న నాయకులు

మేడ్చల్: మండలంలోని వివిధ పాఠశాలల్లో ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (తపస్) సభ్యత్వ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇచ్చి సభ్యులుగా చేర్చుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తూనే జాతీయ భావాలతో దేశ సమగ్రతతకు కృషి చేస్తుందన్నారు. సంఘం నాయకులు నవీన్, గోపాల్, వెంకటరమణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గోధుమకుంటలో వైద్య శిబిరం



శిబిరంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది

కీసర: '100 రోజుల ప్రణాళిక'లో భాగంగా నాగారం మున్సిపల్ పరిధిలోని గోధుమకుంట వార్డు కార్యాలయంలో ఈసీఐఎల్ జీనియా ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కమిషనర్ ఎస్.భాస్కర్‌రెడ్డితో పాటు శానిటేషన్ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొని కంటి, దంత, ఈసీజీ, షుగర్, బీపీ పలు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ధర్మారెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ బాబు, బిల్ కలెక్టర్లు, జీనియా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై ఫిర్యాదులకు సెంటర్ ఏర్పాటు

కీసర: ప్రైవేట్ పాఠశాలలపై ఫిర్యాదుల కోసం కీసర ఎంఆర్‌సీ కేంద్రంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని ఎంఈవో జమదగ్ని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతుల్లేని తరగతులు, తరగతి పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫామ్స్, ఫిట్‌నెస్ లేని బస్సులు, లైసెన్స్ లేని డ్రైవర్లు, విచ్చలవిడిగా ఫీజుల వసూలు, కట్టనివారిపై పనిష్మెంట్, ఇతర విషయాలపై ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకుని సెల్ ఏర్పాటు చేశామని, ఫిర్యాదులు ఉంటే లిఖిత పూర్వకంగా ఇచ్చి రసీదు పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8247735756 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: గోధుమకుంటకు చెందిన బాలమల్లేశ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష 10 వేల మంజూరైంది. దీంతో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎల్‌వోసీ పత్రాన్ని శుక్రవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో గోధుమకుంట మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆది జాంబవ్ మహరాజ్ జయంతి

కుషాయిగూడ: ఉప్పల్ నియోజకవర్గ మాదిగ జాగృతి సంఘం ప్రతినిధులు హెచ్‌బీకాలనీలో ఆది పురుషుడు ఆది జాంబవ్ మహరాజ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆది జాంబవ్ మహరాజ్ దేవ దేవుడని, భూమికే మొదటి ఆదిపురుషడని కొనియాడారు. కార్యక్రమంలో ఏర్పుల లక్ష్మీనారాయణ, రాజు ప్రకాశ్, అశోక్, నర్సింగ్, శివ, రాజ్‌కమల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రావల్‌కోల్‌లో ఐద్వా సభ్యత్వం



సభ్యత్వంలో మహిళలు

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావల్‌కోల్ గ్రామంలో శుక్రవారం ఐద్వా సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నాయకురాళ్లు హాజరై పలువురికి సభ్యత్వం ఇచ్చారు. మహిళలు తమ హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద, మండల నాయకురాళ్లు పూజ, ప్రవళిక, ఉమా, శ్యామల, అండాలు, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై కసరత్తు..!

పురపాలికల్లో సవరణకు ప్రభుత్వం ఆదేశాలు

- శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని 34 పురపాలికల్లో వ్యవసాయేతర ఆస్తుల విలువల సవరణ
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే అమలుకు చర్యలు
- వివరాలు సేకరించే పనుల్లో అధికార యంత్రాంగం



సాక్షి,మేడ్చల్ జిల్లా: పురపాలికల్లో ఆస్తి పన్ను మదింపు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే నూతన విధానం అమలు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. నగర శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని 34 పురపాలక సంఘాల పరిధిలోని వ్యవసాయేతర ఆస్తుల విలువలను సవరించి ఆస్తి పన్ను విధిస్తారు. ఈ మేరకు ఎంత పన్ను పెరగనుందో వివరాలు సేకరించే పనిలో పురపాలక సంఘాల అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

ఖాళీ స్థలాలకు పన్ను..

నగర శివారు పురపాలికల్లో చాలామంది ప్లాట్లు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టకుండా వదిలేస్తున్నారు. ఇలా జిల్లాలోని అన్ని పురపాలికల్లో వేల సంఖ్యలో ఖాళీ (ప్లాట్లు)స్థలాలున్నాయి. వీటికి వీఎల్ (వేకెండ్ ల్యాండ్ ట్యాక్స్) విధించాల్సి ఉంటోంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో వీటికి ఇప్పటివరకు ఎలాంటి పన్నులు విధించని పరిస్థితి నెలకొన్నది. ఇక మీదట ఖాళీ స్థలాలకు వీఎల్ పన్ను చెల్లించమంటే కుదరదు. ఆస్తి విలువలో కనిష్ఠంగా 0.05, గరిష్ఠంగా 0.20 శాతం పన్ను ఖరారు చేయనున్నారు. ఖాళీ స్థలాల్లో భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణానికి అనుమతి తీసుకోవాలంటే వీఎల్ పన్ను రసీదును జత చేయాల్సి ఉంటుంది. పలు పురపాలికల్లో నిధులు లేకపోవడంతో తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులు, అభివృద్ధి పనులకు ఇబ్బందిగా మారుతోంది. అయితే ఆస్తి పన్ను ద్వారా వచ్చే ఆదాయంతో వేతనాలతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను మదింపు ప్రక్రియ పూర్తిచేసి కొత్త పన్ను విధానం అమలు చేసేలా కసరత్తు చేస్తున్నట్లు మున్సిపల్ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆస్తి పన్ను నిబంధనలు ఇలా

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 34 పురపాలక సంఘాలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 16 పురపాలక సంఘాలు ఉండగా, రంగారెడ్డి జిల్లాలో 18 మున్సిపాలిటీలు ఉన్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నివాస భవనాలకు భవన నిర్మాణ విలువలో కనిష్ఠంగా 0.10 శాతం, గరిష్ఠంగా 1 శాతం ఆస్తి పన్ను పెంచనున్నారు. వాణిజ్య భవనాలకు మార్కెట్ విలువలో కనిష్ఠంగా 0.25 శాతం, గరిష్ఠంగా 2 శాతం పన్ను పెరుగుతోంది. పురపాలక చట్టం ప్రకారం 75 గజాల్లోపు ఉన్న భవనానికి ఆస్తి పన్ను పెంపు వర్తించదు. వీటితో పాటు చారిత్రక భవనాలు, ఆసుపత్రులు, పురపాలక భవనాలు, అనాథ, వృద్ధాశ్రమాలకు మినహాయింపు ఉంటుంది.

కల్తీ కల్లు ఘటనపై చర్యలు తీసుకోవాలి



సాక్షి, సిటీబ్యూరో: కల్తీ కల్లు ఘటనపై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు డీజీ నర్సింహారావు డిమాండ్ చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో కల్తీ కల్లు ఘటనలో ఇప్పటివరకు 8 మంది చనిపోగా, అనారోగ్యానికి గురైన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. కల్లు కాంపౌండ్ల యాజమానులు కొందరు అక్రమార్జనే ధ్యేయంగా రసాయనాలతో కృత్రిమ కల్లును తయారుచేసి ప్రజలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నారన్నారు. ఆయా యాజమాన్యాలపై హత్యా నేరం కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారులు కల్లు కాంపౌండ్లపై తనిఖీలు చేస్తే ఈ ఘటన జరిగి ఉండేది కాదన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.కోటి చొప్పున పరిహారం అందజేయాలని కోరారు. అనంతరం ఎక్సైజ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఏ. వెంకటేశ్, కోట రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఒరవడితో ముందుకు సాగాలి



విద్యార్థినికి మెమొంటో ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూహెచ్ వీసీ

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు నూతన ఒరవడితో ముందుకు సాగాలని జేఎన్‌టీయూహెచ్ కిషన్ కుమార్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం 15 గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఉత్తమ విద్యార్థులకు మెమొంటో, మెడల్స్ అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు క్యాప్‌జెమిని సీనియర్ డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రావు, కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బాల్‌రెడ్డి, బోర్డు సభ్యులు జైపాల్‌రెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రారెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలతో నిరుద్యోగం,పేదరికం



డీఎంహెచ్ఓ డాక్టర్.సి.ఉమాగౌరి

సాక్షి,మేడ్చల్ జిల్లా: జనాభా పెరుగుదలతో నిరుద్యోగం, పేదరికం అధికమవుతోందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. ఉమాగౌరి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెరుగుతున్న జనాభా వనరులపై ఒత్తిడిని పెంచి ఆహారం, నీరు, ఆరోగ్యం, విద్య వంటి ప్రాథమిక అవసరాలపై ప్రభావం చూపుతోందన్నారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు సామాజిక భద్రతకు, మాతా,శిశు ఆరోగ్యం, భవిష్యత్ తరాల ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పాటును అందించగలదన్నారు. జనాభా పెరుగుదల వంటి సందర్భాల్లో ప్రతిఒక్కరికీ సమర్థమైన ఆరోగ్యం, విద్య, ప్రణాళికబద్ధమైన కుటుంబ జీవితంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే జిల్లా వైద్యాశాఖలో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకు డీఎంహెచ్ఓ మెరిట్ సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో మల్కాజిగిరి, కీసర డివిజన్ ఉప జిల్లా వైద్యాధికారులు శోభ, సత్యవతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు చంద్రకళ, గీత, మల్లీశ్వరి, కౌశిక్, సూపర్‌వైజర్లు విజయ్ కుమార్, లింగాల అక్షయ్ కుమార్, కమల్, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



ఘట్‌కేసర్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న కమిషనర్ రాజేశ్

ఘట్‌కేసర్: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి రాజేశ్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈడబ్ల్యూఎస్ వద్ద దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించి ర్యాలీ చేపట్టి మొక్కలు నాటారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. వర్షాకాలంలో దోమలు మరింత పెరిగి అవకాశం ఉంటుందని ఇంట్లో పాత టైర్లు, బకెట్లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, ఈఏ రాకేశ్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాయామంతో మానసిక ప్రశాంతత



వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: వ్యాయామంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం స్నేహపురికాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యాయామం చేసిన తర్వాత కూర్చునేందుకు కార్పొరేటర్ సొంత ఖర్చులతో 3 బెంచీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు కేజీఎస్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, యాదవ రెడ్డి, వెంకటస్వామి, పటేల్, వేణుగోపాల్, జ్ఞానేశ్వరూప్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రత్నకర్, రమేశ్, శ్రీనివాస్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంఎంటీఎస్ స్టేషన్ల ఏర్పాటుపై హర్షం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్, లయోలా కాలేజీ వద్ద నూతన ఎంఎంటీఎస్ స్టేషన్ల ఏర్పాటుపై ఎంఎంటీఎస్ ట్రావెల్లర్స్ అసోసియేషన్, స్టేషన్ సాధన కమిటీ సభ్యులు మురళీకృష్ణ, నూర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆనంద్‌బాగ్, లయోలా కాలేజీ వద్ద నూతన ఎంఎంటీఎస్ స్టేషన్ల ఏర్పాటుకు రైల్వే విభాగం ఆమోదం తెలిపిందన్నారు. త్వరగా స్టేషన్ల నిర్మాణం ప్రారంభిస్తే చర్లపల్లి స్టేషన్ నుంచి దూరం ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. స్టేషన్ల ఏర్పాటుకు సహకరించిన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి



మేయర్, కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో పెండింగ్ పనులు వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కోరారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆర్‌వీ. కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శివసాయినగర్ నుంచి కుషాయిగూడ డీమార్ట్ వరకు మొదటి విడత బాక్స్ డ్రైన్ పనులు పూర్తి చేసి డీమార్ట్ నుంచి సాయినగర్, కృష్ణారెడ్డినగర్ వరకు రెండోవిడత పనులు ప్రారంభించాలని కోరారు. అలాగే కుషాయిగూడ, నాగర్జుననగర్ కాలనీ, ఇందిరానగర్, పెద్ద చర్లపల్లి, చిన్న చర్లపల్లి, ఫుకట్‌నగర్, భరత్‌నగర్ కాలనీల్లో పెండింగ్ పనులతో పాటుగా చర్లపల్లిలో శ్మశానవాటిక పనులు వేగవంతం చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. స్పందించిన మేయర్, కమిషనర్ సకాలంలో పనులు పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలిస్తామని హామీనిచ్చినట్లు ఆమె తెలిపారు.

సహకార సంఘం సందర్శన

శామీర్‌పేట్: శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘాన్ని నాబార్డ్ అధికారులు శుక్రవారం సందర్శించారు. రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు మధుకర్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందించడం వివిధ దశల్లో రైతులకు దిగుబడి పై సలహాలు, సూచనలు ఇస్తూ మార్కెట్ సౌకర్యం కల్పిస్తూ చేపడుతున్న ఫార్మ్ రైస్ వన్ పనులపై నాబార్డ్ టీం స్టడీ చేశారు. కార్యక్రమంలో నాబార్డ్ టీం రాజమోహన్, అజయ్ కుమార్ గుప్తా, మేనేజర్ బెంజమాన్, ట్రస్కేబ్ అధికారులు, డీసీసీబీ అధికారులు, ఫార్మ్ రైస్ వన్ ప్రతినిధులు, సంఘం వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

శామీర్‌పేట్: సాగు నీటి కాల్వ పై అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ అలియాబాద్ గ్రామస్తులు మున్సిపల్ అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అలియాబాద్ మున్సిపాలిటీలో తాళం బస్తీ వద్ద సాగు నీటి కాలువపై కొందరు అక్రమార్కులు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని, గొలుసు స్థలం వదిలేసి నిర్మాణాలు చేపట్టాలని లేకుంటే నిర్మాణాలను తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీసీలకు 42 శాతం కోటా చరిత్రాత్మకం

ఘట్‌కేసర్: బీసీలకు 42 శాతం కోటా ఇవ్వాలని మంత్రివర్గం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్ పేర్కొన్నారు. ఘట్‌కేసర్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ పెంచడం వల్ల బడుగులు రాజకీయంగా ఎదుగుతారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటారన్నారు.

ప్రణాళికతో అభివృద్ధి పనులు

మల్కాజిగిరి: ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఓల్డ్ మల్కాజిగిరి, ఎస్పీనగర్‌లో సీసీ రోడ్ల ప్యాచ్ వర్క్ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సఫిల్‌గూడ లేక్ పార్కులోని వినాయక నిమజ్జనఘాట్ ఆధునీకరణకు రూ 1.5 కోట్లు మంజూరయ్యాయని, ఈసారి నిమజ్జనానికి మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ నవీన్, జలమండ లి మేనేజర్ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు సౌకర్యాలు కల్పించాలి

ఉప్పల్: ఉప్పల్‌లో బోనాల సందర్భంగా భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్లు రజిత పరమేశ్వర్‌రెడ్డి, స్వర్ణరాజ్ శివమణి, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, తదితరులు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆలయాల వద్ద పారిశుద్ధ్యం, విద్యుత్ లైట్లు, తాగునీరు రోడ్లు తదితర సౌకర్యాలను కల్పించాలని కోరగా జడ్‌సీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

డ్రైనేజీ రీమోడలింగ్ చేయాలని వినతి

అల్వాల్: వెంకటాపురం డివిజన్ సుభాష్‌నగర్‌లో పాడైన డ్రైనేజీలను రీమోడలింగ్ చేయాలని కోరుతూ బస్తీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనిల్‌కిశోర్, బస్తీవాసులు ప్రభాకర్, ఆనంద్‌రావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ

కీసర: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని రైతులకు సబ్సిడీపై పలు పథకాలు అందించనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టమాటా, వంకాయ, మిర్చి కూరగాయల నారులు, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, అత్తి, బొప్పాయి మొక్కలు నాటిన రైతులకు నిర్వహణ ఖర్చులపై 40 శాతం సబ్సిడీ, 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్యాక్‌హౌస్ కట్టిన రైతులకు రూ.2 లక్షల వరకు రాయితీ, అలాగే మల్చింగ్ పద్ధతిలో కూరగాయలు వేసే రైతులకు 50 శాతం సబ్సిడీ, అలాగే రాయితీపై స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పాత తోటల పునరుద్ధరణకు, ఫాంపండ్ నిర్మాణానికి 50 శాతం, అంటుకట్టిన వంకాయ మొక్కలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని, బంతి పూల సాగుకు సబ్సిడీ ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కీసర డివిజన్ ఉద్యానవన అధికారి 8977714464 లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పేదలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట్: నిరుపేదలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శామీర్‌పేట్ మండలంలోని మురహరిపల్లిలోని డబుల్‌బెడ్రూం ఇళ్లను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇక్కడి వారంతా కూలీ పని చేసుకుని బతుకున్నారని, వీరికి సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె ఇంట్లో ఉంటే చనిపోతే శవాన్ని కూడా ఇంటికి తీసుకురానివ్వరని, ప్రతిఒక్కరూ సొంత ఇల్లు కావాలని కోరుకున్న వారికి డబుల్ బెడ్రూం ఇల్లు వచ్చినా సంతోషం లేకుండా పోయిందన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ఎక్కడి వారికి అక్కడే డబుల్‌బెడ్రూంలు కట్టించాలని కోరానని, కానీ అప్పుడు వినలేదని గుర్తుచేశారు. తాగునీరు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తుంటే ఫారెస్ట్, రెవెన్యూ అనుమతులు రావడం లేదన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి త్వరలో సమస్యలు తీర్చేలా కృషి చేస్తానని ఎంపీ వారికి హామీనిచ్చారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. '100 రోజుల కార్యాచరణ ప్రణాళిక'లో భాగంగా 4వ వార్డు వీఆర్‌ఆర్‌కాలనీలో డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులపై, ఇంటింటికీ తడి, పొడి చెత్త వ్యర్థాల వేరు చేయడంపై అవగాహన కల్పించారు. వర్షాపు నీరు వృథాకాకుండా అపార్టుమెంట్ల వద్ద ఇంకుడు గుంతలను తనిఖీ చేయడం, అహ్మద్‌గూడలో రోడ్డుకిరుపక్కలా చెత్త, పొదలు తొలగింపు, కీసరలో భూగర్భ డ్రైనేజీలు శుభ్రం చేయడం, నాలాల్లో పూడికతీత పనులు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, కార్యాలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మనోభావాలు దెబ్బతీసేలా చర్యలు ఉండొద్దు



అభిప్రాయాలు తెలుసుకుంటున్న మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి

అల్వాల్: ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా అధికారుల చర్యలు ఉండవద్దని మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి అన్నారు. మచ్చబొల్లారంలో డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ 2 నెలలుగా సుమారు 50 కాలనీ ప్రతినిధులు ఆందోళన చేస్తున్నారు. శుక్రవారం ఆమె మచ్చబొల్లారం వచ్చి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా, జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీఓ శ్యాంప్రసాద్, డీసీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రాములు తదితరులు డంపింగ్ యార్డు వద్దకు వచ్చి వివరాలు తెలిపారు. డంపింగ్‌యార్డు నిర్మాణం మున్సిపల్ పరిధిలో ఉందని తాము ఎలాంటి చర్యలు తీసుకోలేమని తెలిపారు. స్థానికులు మాట్లాడుతూ..హిందూ శ్మశానవాటిక కోసం దాతలు ఇచ్చిన స్థలాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు చెత్త డంపింగ్ కోసం ఉపయోగించడం సబబు కాదన్నారు. సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆమె కోరారు. కార్యక్రమంలో పలు కాలనీల ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్ల పూడ్చివేత

ఉప్పల్: స్పెషల్ టీమ్‌తో గుంతల రోడ్లను పూడ్చివేస్తున్నామని జీహెచ్‌ఎంసీ ఎస్ఈ అశోక్‌రెడ్డి అన్నారు. చిలుకానగర్ డివిజన్‌లోని రాఘవేంద్ర నగర్‌లో జీహెచ్‌ఎంసీ రోడ్ సేఫ్టీని శుక్రవారం ప్రారంభించారు. గుంతల రోడ్లను సిమెంట్, కాంక్రీట్‌తో ప్యాచ్ వర్క్స్ పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఈఈ హరీలాల్, డీఈ వెన్నెల్‌గౌడ్, ఏఈ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేధార్, బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, వికాస్, రోషి రెడ్డి, వెంక టేశ్వరరెడ్డి, మనోజ్, మాణిక్, ప్రభు, సతీశ్, జగన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.